# షరతులు

'పెళ్ళిచూపులకు వారొచ్చారు... చూడాలని నేను ఓరగా చూశా' అనే రోజులు పోయాయి. ఇప్పుడు అమ్మాయిలు కూడా వ్యక్తిత్వం, ఆత్మ విశ్వాసంతో ధైర్యంగా తలఎత్తి చూస్తున్నారు, ప్రశ్నిస్తున్నారు కూడా! అది చదువుల వలన కావచ్చు, తమ కాళ్ళపై తాము నిలబడగలమన్న ఆత్మస్థైర్యం కావచ్చు. అయితే అది అహంభావంగా మారితే మాత్రం సమస్యే సుమా!

అరుణకి పెళ్ళిచూపులు... అరుణ చాలా తెలివైన అమ్మాయి మాత్రమేకాదు అందమైనదీ, చురుకైనదీ. గోల్డ్ మెడలిస్ట్. ఆమెని ఆరాధించని వాళ్ళు, అభిమానించని వాళ్ళూ ఎవరూ ఉండరంటే అతిశయోక్తికాదు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఒక ప్రముఖ సంస్థలో పనిచేస్తున్న అరుణ చాకచక్యం, ఆలోచనా వేగానికి ఆమె పై ఆఫీసర్లు సైతం అబ్బురపడతారు. అలాగని ఆమె ఇంట్లో ఏ పనీ చేయదంటే పప్పులో కాలేసినట్లే!


వెరైటీ వంటలు చేయడం ఆమె హాబీ! అందరూ ఇష్టంగా తింటూంటే మరీ ఇష్టం! ఇప్పటి కాలంలో చాలామందిలాగా 'టీ.వీ. చూడడం నా హాబీ' అనే వాళ్ళంటే ఆమెకు ఒళ్ళుమంట! వాళ్ళందరూ సోమరిపోతులని ఆమె నమ్మకం.

అరుణ ఖాళీ సమయాన్ని మంచి మంచి పుస్తకాలు చదవడానికి, అనాధబాలలకి సేవ చేస్తూ వాళ్ళకి తోచిన సాయం చేయడానికీ వినియోగిస్తుంది. ఆమె జీవితంలో 'ఫ్రీ' అన్న

సోమంచి ఉషారాణి

మాటకు తావులేదు. బద్ధకంగా నిద్రపోవడం ఎవరూ చూడలేదు. యాంత్రిక జీవితంలో అరుణొక ఆగని, అలసట ఎరగని అందమైన, చురుకైన, తెలివైన యంత్రం.


పెళ్ళిచూపులకొచ్చిన తరుణ్‌కి, అతని తల్లిదండ్రులు, చెల్లెలికీ అరుణ బాగా నచ్చింది. కట్నకానుకలక్కరలేదు. పెళ్ళిమాత్రం గ్రాండ్‌గా



జరిపిస్తే చాలన్నారు.

అనూహ్యంగా అరుణ "నావి కొన్ని షరతులున్నాయి" అంది.

పెళ్ళిచూపులకొచ్చిన వారు ఉలిక్కిపడినా, "చెప్పండి" తరుణ్ చిరునవ్వుతో తన కలవరపాటు కప్పిపుచ్చుకుంటూ అన్నాడు. అందరూ ఆసక్తిగా చూస్తున్నారు.



"నన్ను ఎట్టి పరిస్థితులలోనూ ఉద్యోగం మానమనకూడదు. నేను ఎన్ని గంటలకు వెళ్ళినా. వచ్చినా ప్రశ్నించకూడదు. ఎందుకంటే నా బాధ్యత నాకు తెలుసు. ఇది అహంభావం కాదు. ఆత్మవిశ్వాసం.

పిల్లల బాధ్యత ఇద్దరం పంచుకోవాలి. అంటే వాళ్ళకి ఏదైనా అనారోగ్యం వచ్చినా, చదువు చెప్పాలన్నా అది కేవలం భార్య బాధ్యత అనుకోకూడదు. ఆఫీసులో అర్జంటు పనిని బట్టి ఎవరు వీలైతే వారు సెలవు పెట్టి, పిల్లల్ని చూసుకోవాలి.

నా జీతంలో సగం మాత్రమే ఇంటి ఖర్చులకిస్తాను. మిగతాసగం గురించి ఎప్పుడూ అడగకూడదు. అఫ్‌కోర్స్! అనాధ బాలలకి

ఖర్చు పెడతానని చెప్పడానికి నాకేం అభ్యంతరం లేదు. కొన్నాళ్ళకు అది మీకు కష్టమనిపిస్తే అందుకు నా బాధ్యత లేదు.

ఈ షరతులన్నిటికీ మీకు అంగీకారమైతేనే ఈ పెళ్ళి జరుగుతుంది. ఈ కాగితం మీద మీరందరూ సంతకాలు చేయవలసి ఉంటుంది. కేవలం ముందు జాగ్రత్త కోసమే"

'ఎంతైనా చాలా తెలివైంది అరుణ' మనసులోనే అనుకుని, పైకి "ఇంతేనా? ఇంకేమైనా ఉన్నాయా?" నవ్వుతూ అడిగాడు తరుణ్.

కొడుకెక్కడ వెంటనే 'ఓకే' అనేస్తాడేమోనని కంగారుగా చూశారు అతని తల్లిదండ్రులు.

"ఇంటికెళ్ళి ఆలోచించి, ఏ సంగతీ తెలియజేస్తాం" అని కొడుకుని బలవంతాన లేవదీసి, వెళ్ళిపోయారు.

"నువ్వు తొందరపడ్డావేమోనమ్మా! ముందే షరతులు పెడితే ఎవరు చేసుకుంటారు? గర్వం అనుకోరూ? పెళ్ళాయ్యాక మెల్లిగా నీ భర్తకి నచ్చచెబితే సరిపోయేదానికి..." తండ్రి బెంగ పడడం సహజమేగా మరి!

"ఇంకా మెల్లిగా అంటారేమిటి? 'ఆవిడేమన్నా మహారాజకుమారిననుకుంటోందా? షరుతులు పెడుతోంది? హవ్వ!' అని నోరు నొక్కుకొని వచ్చే సంబంధాలు కూడా..."

"అమ్మా! మీరేం కంగారుపడకండి... నాది అహంకారం కాదు. ఆత్మాభిమానం అని తెలుసుకున్న వాళ్ళే చేసుకుంటారు. సంబంధాలు రాకపోతే పోనీ ఇలాగే ఉండిపోతాను. తరువాత ఇద్దరిమధ్యా గొడవలొచ్చి, విడిపోతే దానికన్నా అదే నయం కాదూ?" అని అరుణ తన గదిలోకి వెళ్ళిపోయింది చదువుతున్న పుస్తకాన్ని పూర్తి చేయడానికి.

"ఏమిటండీ దీని ధైర్యం? మీరు కూడా గట్టిగా మందలించకుండా గుళ్ళో ఉత్సవ విగ్రహంలా చూస్తూ కూర్చుంటారే"

"అది ఏంచేసినా ఆలోచించి చేస్తుందనే నా నమ్మకం. నువ్వేం కంగారుపడకు" అని పేపరు చదవడంలో మునిగిపోయాడాయన.


సరిపోయింది తండ్రీకూతుళ్ళకి! ఎటొచ్చీ ఊళ్ళో వాళ్ళకి సమాధానం చెప్పలేక చచ్చేది నేనేగా!" ఆ రోజంతా ఏవో శబ్దాలు చేస్తూ ఆవిడలా గొణుగుతూనే ఉంది.

"ఎంత చదువుకుంటే మాత్రం అంత అహంభావమా? ఆవిడగారు షరతులు పెడితే, మనం 'డూడూబసవన్నలా' తలూపుతూ కూర్చోవాలా? ఇప్పుడే ఇలా ఉంటే రేపు పెళ్ళయ్యాక మనమీద సవారీ చేయదూ?"

తల్లిమాటలకి, చేతలకీ అన్నా చెల్లెళ్ళిద్దరూ ఫక్కున నవ్వారు. "అమ్మా! ఆ అమ్మాయి షరతుల్లో అంత కాని విషయం ఏముంది? రేపు నువ్వలా అనుకోకూడదనే, ఏ గొడవలూ రాకూడదనే ముందుగా చెప్పింది. పెళ్ళయ్యాక అత్త మామల్నీ, మొగుడ్నీ, ఇంటి బాధ్యతల్నీ పట్టించుకోకుండా తిరిగేవాళ్ళు ఎంతమంది లేరు? తను చాలా తెలివైన అమ్మాయి కనుక ముందు చూపుతో షరతులంటూ చెప్పింది. ఆమె వ్యక్తిత్వానికి, ఆత్మ గౌరవానికీ ఒక స్త్రీగా ప్రోత్సహించాలి, గౌరవించాలి".

"ఆ అమ్మాయి మాటలకేమోగాని, నీలాంటి కొడుక్కి తల్లిగా గర్విస్తున్నానురా! అందరూ నీలా ఉన్నతంగా, సంస్కారంగా ఆలోచిస్తే సంసారాల్లో ఇన్ని గొడవలు, విడాకులూ ఉండవు" తల్లి ప్రేమగా తలనిమురుతూంటే తరుణ్ భుజాలేగరేసి చెల్లెల్ని వెక్కిరించాడు.

"కొడుకుని అంతగా పొగడకు. ఆయుక్షీణం! అమ్మాయి బాగా సంపాదిస్తోంది కదాని కట్నం వద్దంటే సగం జీతమే ఇస్తానంటోంది" తండ్రిలో ఇంకా ఎక్కడో దబ్బాశ చూసి తరుణ్




బాధపడ్డాడు.

"నాన్నా! మనకు డబ్బు ముఖ్యమా? నీ సంపాదన, నా సంపాదనా సరిపోదా? చెల్లెలి పెళ్ళికి ఎలాగూ దాచావు. మనిషి అవసరానికి మించిన డబ్బు ఏం చేసుకుంటాడు? అదీకాక తను అనవసరంగా ఖర్చు చేయడం లేదు కదా!"

"చూశావామ్మా? ఇంకా పెళ్ళికాకుండానే పెళ్ళాన్ని వెనకేసుకొస్తున్నాడు. ఇక పెళ్ళైతే...?" అన్నయ్య మొట్టబోతూంటే పారిపోయింది.

అరుణ, తరుణ్‌ల పెళ్ళి వైభవంగా జరిగింది. ఇద్దరూ అన్యోన్యంగా పరస్పర అవగాహనతో మెలగడం రెండు కుటుంబాల వారినీ సంతోషపెట్టింది.

అరుణ శని, ఆదివారాల్లో వెరైటీ వంటలు చేసి అందరి మెప్పు సంపాదించింది. సినిమాలకు, షికార్లకూ అందరూ కలిసే వెళ్ళేవారు. లోన్ తీసుకుని అరుణ కారు కొని తనే డ్రైవ్ చేసేది. తరుణ్ కూడా ఆమె దగ్గర డ్రైవింగ్ నేర్చుకున్నాడు.

ప్రతి ఆదివారం సాయంత్రం మాత్రం అరుణ అనాధ పిల్లలతో గడిపేది. తరుణ్ ఇష్టమైతే వచ్చేవాడు. లేకపోతే బద్ధకంగా ఉందని టీ.వీ. చూస్తూ కూర్చునేవాడు.

అరుణకి కంపెనీ తరపున ఆరు నెలలు ఫారిన్ వెళ్ళే అవకాశం వచ్చింది. అది సంతోషించదగ్గ విషయమైనా ఆమె అలా వెళ్ళడం కొంచెం ఇబ్బందనిపించింది. ముఖ్యంగా తరుణ్ 'నిన్ను విడిచి అన్ని రోజులు నేనుండలేను' అన్నాడు.

"తరుణ్! డోంట్ బీ సిల్లీ! ఆరునెలలు ఎంతలో తిరిగొస్తాయి? ఈ అవకాశం ఇప్పుడు పోగొట్టుకుంటే మళ్ళీ ఎప్పుడొస్తుందో? అసలు వస్తుందో రాదో? తర్వాత ప్రమోషన్ కూడా వస్తుంది తెలుసా?" పరిపరి విధాల నచ్చజెప్పింది అరుణ.

చివరికి అందరినీ ఒప్పించి ఫారిన్ వెళ్ళిపోయింది అరుణ. అక్కడ ఎంతపనిలో ఉన్నా తరుణ్‌కి ఫోన్ చేసేది. అతనికి వీలైనపుడు

ఇంటర్‌నెట్‌లో చాటింగ్ చేసేది.

అయితే అరుణ ఫారిన్‌లో పనిచేసే చోట ఒకతను అమెరికన్... విలియమ్స్... ఆమె అందచందాలు, తెలివితేటలూ చూసి 'ఐ లవ్ యు' అంటూ వెంటపడి వేధించేవాడు. తనకి పెళ్ళయిందనీ తనకు ఇండియా అంటేనే ఇష్ట మనీ, అక్కడికే వెళ్ళిపోతాననీ ఎంత మంచిగా చెప్పినా అతను వినిపించుకోలేదు. 'తన దగ్గర చాలా డబ్బుందని, డాలర్లలో ముంచెత్తుతానని, దర్టీ ఇండియాలో ఏముంద'నీ ఆశపెట్టేవాడు.

"నా దేశాన్ని, నా ప్రజల్నీ నిందిస్తే మర్యాదగా ఉండదు. భారతదేశమనే పేరులోనే గౌరవం ఉంది. హిందువులంటేనే పవిత్రత ఏర్పడుతుంది. ప్రజలు ఆకలితో అలమటించినా ఆప్యాయతకు, మమతానురాగాలకూ కొదవుండదు. పేదరికంలో పుట్టి పెరిగినా ఆత్మాభిమానంతో బ్రతుకుతారు. దయచేసి ఇక ఆ విషయం మర్చిపో. మనం ఫ్రెండ్స్‌గా ఉందాం. స్నేహం విలువ, స్నేహంలోని ఆత్మీయతా అనుభవించిన వాళ్ళకే తెలుస్తుంది".

అరుణ చెప్పింది వింటూంటే ఆమె అంటే ఇంకా ప్రేమానురాగాలు పెరగడమేకాక ఇండియా చూడాలన్న కోరికా పెరిగింది. అంతేకాదు... అరుణతో తానూ బయలుదేరాడు.

అతని సంగతి అరుణ ఫోన్‌లో చెప్పడంతో తరుణ్ ఆప్యాయంగా రిసీవ్ చేసుకున్నాడు విలియమ్స్‌ని. అతని మాటలు అర్థం కాకపోయినా అతన్ని అందరూ గౌరవంగానే చూసారు.

అరుణతో ఆఫీస్‌కి వెళ్ళి, అక్కడ వాళ్ళ వర్క్ సిన్సియారిటీ, తెలివితేటలూ చూసేవాడు. చుట్టుప్రక్కల ప్రదేశాలు అరుణ, తరుణ్‌తో వెళ్ళినా ఇండియాలో ముఖ్యమైన ప్రదేశాలు అన్నీ ఒక్కడే వెళ్ళి చూసి వచ్చేవాడు.

ఆరు నెలలు ఆరు నిమిషాల్లా గడిపేశాడు. అతడు వెళ్ళే రోజు దగ్గర పడింది. అరుణ అనాధ పిల్లలకు సాయం చేయడం చూసి ఆమెని రెట్టింపుగా అభిమానించాడు. తాను కూడా పెద్ద మొత్తాన్ని డొనేషన్‌గా ఇచ్చి దిగులుగా తిరిగి వెళ్ళాడు.

అరుణకి ప్రమోషన్ రావడంతో ఇంకా బాధ్యతలు పెరిగాయి. ఆమె ప్రెగ్నెంటైనా, డెలివరి అయినాక కూడా రోజూ ఆలస్యమైపోయేది. అత్తగారు పాపని ప్రేమగా చూసుకోవడం, తరుణ్ వచ్చి ఇంటికి తీసుకు వెళ్ళడం... అరుణ పొంగిపోయేది.

జీవితాన్ని అనుభవించి ఆస్వాదించేవాళ్ళకి ప్రతిరోజూ పండగే! ప్రతిరేయీ తొలిరేయే! అనుమానాలతో, అపార్థాలతో బ్రతికేవారికి బ్రతుకంతా భారమే, వేదనే! ఏ షరతులూ వారిని రక్షించలేవు. ●

### 'కళా' హృదయం

ఇద్దరు ప్రెస్ ఫొటోగ్రాఫర్లు మాట్లాడుకొంటున్నారు. వాళ్ళలో మొదటతను ఇలా చెప్పుకొచ్చాడు... "నిన్న ఒక హృదయ విదారకమైన సీను చూశాన్రా! ఇద్దరు చిన్న పిల్లలు కుప్పతొట్టి దగ్గర తిండికోసం వెదుక్కొంటూ, ఏడుస్తూ కన్పించారు. ప్చ్... భరించలేకపోయాననుకో! ఇక తప్పదని వెంటనే వాళ్ళదగ్గరికెళ్లా!"

రెండోతను (ఆత్రంగా): "ఆ! వెళ్ళి? వెళ్ళి ఏంజేసావ్?

మొదటతను: "ఎండ ఎక్కువుందని షట్టర్ స్పీడ్ 1/250 లో ఉంచి, అపర్చరు 16లో పెట్టి క్లిక్‌మనిపించా!"

రెండోతను: ???